

# ఆదర్శం

సజ్జపల్లి చిదంబరరెడ్డి

ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)
రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు) సంయుక్తంగా
నిర్వహించిన కథల పోటీ 1997లో సాధారణ
ప్రచురణకు ఎంపికైన కథ.

**ఐశ్వర్య అంగడిలో గల్లా పెట్టెముందు కూర్చొని సరుకుల లిస్టు రాసుకొంటు, పనివారితో పాకెట్లు కట్టిస్తూ కస్టమర్ల కందిస్తూ నోట్లు లెక్కబెడుతూ ఊపిరి సలపనంత బిజీగా వుంది.**

ఆదెమ్మ అంగడిముందు బెంచీపై కూర్చొని అప్పటికి అరగంటయింది. ఆమె మనస్సు ఏమీ బాగా లేదు - పిల్లల చేత చిక్కి చిక్కుబడిపోయిన దారపు చెండులాగుంది.

ఎందుకంటే తను అణగారిన వర్గంలో ఆశా జ్యోతి కావాలని తల్లీదండ్రులు ఆమెను కష్టపడి చదివించారు. రెండేళ్లుగా ఇంటర్వ్యూలకు తిరుగుతున్నా - పేరుకు రిజర్వేషన్లు గాని ప్రతి చోటా పోటీలు, రెకమెండేషన్లు, ధనబలాల లాలూచీలు. ఏ చిన్న ఉద్యోగమూ దొరకడం లేదు. అన్నీ ఉన్నవారే గద్దల్లా తన్నుకుపోతున్నారు.

తనతోపాటు చదివిన చాలామంది అమ్మాయిలు అసలు ఉద్యోగ ప్రయత్నమే చేయలేదు. వారి బ్రతుకులు వడ్డించిన విస్తర్లు. చదువు ముగుస్తూనే తమ వారు చేసే పనుల్లోను, వ్యాపారాల్లోను సహకరిస్తూ కడుపులోని చల్ల కదలకుండ బతికేస్తున్నారు.

ఇంత చదివి తను అమ్మానాన్నల్లా కూలిపని చేయజాలదు. ఉద్యోగం చేసే ఏ అయ్య చేతిలోనో తాళి కట్టించుకొని జీవితంతో రాజీ పడదామంటే కట్నం డబ్బుల మూటలు లేక సాధ్యపడటం లేదు. మరి ఏం చేయాలి? గుడ్లప్పగించి చూస్తూ వుంటే ఎప్పటికైనా అవకాశం దానంతట అదే ఎదురౌతుందా? లేక తనే సాహసించి అవకాశాలు కల్పించుకోవాలా? అయితే ఎలాగ?? ... ఎడతెగని ఆలోచనలు మండిపోతున్న రాయలసీమ ఎండలు.

అదే అంగడి దగ్గరకు తన పల్లెవారు, చుట్టు పక్కల పల్లెల వారు గుంపులు గుంపులు వస్తున్నారు. సరుకులు కొంటు ఆదెమ్మను పలకరించి పోతున్నారు.

అంతలో ఐశ్వర్య భర్త నారాయణ శెట్టి వచ్చి, అప్పటికే వచ్చి ఆగి ఉన్న లారీ నుండి సరుకుల బస్తాలు దింపించసాగాడు. ఐశ్వర్య అంగడిని భర్తకప్పగించి ఆదెమ్మను అటుపక్కనే ఉన్న ఇంటికి తీసుకువెళ్ళింది.

ఎక్కడికి ఇంటర్వ్యూలకు వెళ్లవలసి వచ్చినా ఆదెమ్మ ఐశ్వర్య దగ్గరే ఖర్చుల కోసం అంతో ఇంతో తీసుకువెళుతూ నాన్న కూలి డబ్బులు వచ్చాక వాపసు చేస్తూ ఉంటుంది. ఇప్పుడు కూడా డబ్బు అడగడానికే వచ్చింది కాని ఎప్పటిలా వందా రెండు వందలు కాదు. యాభైవేలు లంచం ఇస్తే పండెండు వందల జీతం వచ్చే ఉపాధ్యాయ ఉద్యోగం గ్యారంటీగా ఇప్పిస్తామని ఎవరో మధ్యవర్తులు నమ్మకంగా చెబితే దాని కోసం అప్పు అడుగుదామని వచ్చింది.

తీరా వచ్చాక - అంత డబ్బు లంచంగా ఇచ్చి గానుగెద్దు చాకిరీ చేసే బదులు అదే డబ్బు పెట్టుబడిగా పెట్టి ఐశ్వర్యలాగా ఏదైనా వ్యాపారం చేద్దామన్న ఆలోచన వచ్చి ఐశ్వర్యతో వివరించింది.

దానికి ఐశ్వర్య స్పందిస్తూ - " పట్టుదలతో కృషి చేస్తే వ్యాపారమంత లాభసాటి వ్యాపకం మరొకటి వుండదు. అయితే స్వగ్రామంలో చేయడానికి మీది మరీ చిన్న ఊరు. పట్నంలో చేయడమంత సులభం కాదు. మంచి సెంటరులో మూడు చదరాల గది దొరకాలంటే కనీసం మూడు లక్షల అడ్వాన్సు, ప్రతి నెల మూడు వేలకు తగ్గని బాడుగ. సరుకులు వగయిరా సామగ్రికి మరో రెండు లక్షలు ..." అంటు లెక్కలు గడుతుంటే ఆదెమ్మ నీరుగారిపోయింది.

ఐశ్వర్య వేడి వేడి కాఫీ ఇచ్చి "చూడు ఆదీ! నేను చెప్పింది ఈ ఊళ్లో నేను చేస్తున్న వ్యాపారానికి సంబంధించిన పెట్టుబడి. అయితే ఇది తిరుగు లేనిది మాత్రం కాదు. ఎవరెవరి ఆలోచనల బట్టి, చాకచక్యాన్ని బట్టి చేసే వ్యాపారముంటుంది. చదువుగాని, పైసా పెట్టుబడిగాని లేకుండ వ్యాపారం చేసి లక్షలు, కోట్లు సంపాదించినవారి ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. 'నెసెసిటీ ఈద మదర్ ఆఫ్ ఇన్వెన్షన్' అనే నానుడి ఊరికే పుట్టలేదు. తీరిగ్గా ఆలోచించుకో. చేతనయిన సాయం చేయడానికి నేనెప్పుడూ సిద్ధమే" అని భరోసా ఇచ్చింది.

మరల కలుస్తానని చెప్పి ఆదెమ్మ తన ఊరికి బయలుదేరింది.

తన ఊరికి, చుట్టుపక్కల గ్రామాలకు కలిపి రెండు టౌను సర్వీసులున్నాయి. అవి రోజుకు ఇరవై ట్రిప్పులు తిరుగుతున్నా వచ్చీపోయే జనాలతో ఎప్పుడు చూసినా కిటకిటలాడిపోతుంటాయి. ఇతర సనులకన్నా మారుమూల పల్లెల్లోని అంగళ్లలో ధరలు ఎక్కువని, మంచి సరుకులు దొరకవని ప్రతి ఒక్కరు పని పాట్లు మాని సరుకుల కోసం హిందూపురానికే వెళుతుంటారు. 'వారందరికీ తను సరసమైన ధరలకు సరఫరా చేయగలిగితే!!' అనే ఆలోచనతో ఇల్లు చేరింది.

రాత్రంతా ఆలోచనలు. పక్కమీద దొర్లుతూ కంటికి కునుకు రాలేదు. తెల్లారేసరికి ఆలోచనలన్నీ ఒక కొలిక్కి రావడంతో ఆనంద్ దగ్గరికెళ్లింది.

ఆనంద్‌ది అదేవూరు. చిన్నప్పట్నుంచి కలిసే చదువుకున్నారు. ఆర్థిక స్తోమత లేక డిగ్రీ ముగించకుండానే చదువుమాని ప్రసిడెంటుగారింట్లో ట్రాక్టర్ డ్రయివరుగా చేరిపోయాడు.

తనను పెళ్ళాడమని ఆదెమ్మ దగ్గరకు రాయబారం పడిపాడుగాని అప్పట్లో ఆమె అభిప్రాయాలు వేరుగా వుండి తిరస్కరించింది. అయితే ప్రస్తుతం తనకు అన్ని రకాలుగా సహకరించగలవాడు, అవసరమనవాడు ఆనందే అనుకొని విషయాన్నంతా అతనికి వివరించింది.

అతను కూడా ఏదో సాధించాలనే ఉబలాటం ఉన్నవాడు. అవకాశం రాక, చొరవలేక ఐదొందల జీతంతోనే రాజీ పడి వయస్సు పైబడిన తల్లిదండ్రుల కింత గంజిపోస్తున్నాడు. ఆదెమ్మ చెప్పింది విని ఎగిరి గంతేశాడు. తను కోరుకుంటున్నదిన్నది తనంత తానే వచ్చి తలుపులు తట్టి ఏ పని చెయ్యమంటే చెయ్యననే మొగాడుంటాడు మరి!!

ఇద్దరూ టౌనుకు బయల్దేరారు. ఐశ్వర్య వారికి కావలసిన సరుకులన్నీ తమ షాపీ వుండి ఇప్పించడానికి పూనుకుంది. మరల ఇంకో క్లాస్‌మేట్ ఆసియా బాను దగ్గరికెళ్లారు. ఆమె పుట్టింటివారు బస్సు ఓనర్లయితే అత్తింటివారు లారీ యజమాన్లు. 'ఆసియా రోడ్ లైన్స్' అని ఆమె పేరు మీదనే ఎన్నో లారీలు నడుస్తున్నాయి.

తాను చేయబోయేదంతా ఆసియా బానుకు చెప్పి నెల రోజుల పాటు ఒక లారీని అద్దె కిమ్మని అడిగింది.

దానికామె ఆనందిస్తూ "ఒక పల్లెటూరి ఆడపడుచు స్వయం ఉపాధితో బతకడానికి ప్రయత్నించడమే సాహసం. అది కూడా మారుమూల పల్లె ప్రజలకు కావలసిన సరుకులు వారి గడపల దగ్గరే అందించాలనుకోవడం గొప్ప సేవ! ఇది ప్రయోగదశ కాబట్టి మొదటి నెలకు ఎలాంటి అద్దె లేకుండా లారీ పంపే ఏర్పాట్లు చేస్తాను. ఈ ప్రయత్నం విజయవంతమై స్త్రీ జాతి గర్వపడేలా ఎదగాలని కోరుకొంటున్నాను" అని అభినందించి ఆప్యాయంగా బొట్టుపెట్టి సాగనంపింది.

మిత్రుల ప్రోత్సాహంతో ఆదెమ్మలలో ఎక్కడలేని ఉత్సాహం పొంగుకు రాసాగింది. ఆనంద్ డ్రైవింగ్‌లోను, మెకానిజంలోను ఆరితేరినవాడు. సరుకులు కొనేవారు సులభంగా లారీని ఎక్కడానికి, దిగడానికి అనువుగా చెక్కపలకలతో మెట్ల ఫ్రేము ఏర్పాటు చేసి, త్రాసు తూనికరాళ్లు వగయిరా సామగ్రి కొన్నాడు.

ఇద్దరూ కాలినడకన ఊరూరూ తిరిగి జనసమ్మర్దమున్న చోట్ల, నీళ్ల ట్యాంకుల దగ్గర తమ లారీ వచ్చే సమయం, సరుకుల ధరలు పెద్ద అక్షరాలతో గోడల మీద రాసి ప్రచారం చేసి. వచ్చారు.

మరుసటి రోజు ఉదయం లారీ బయలుదేరి ఒక్కో ఊళ్లో మూడు గంటల ప్రకారం ముందుగా నిర్ణయించుకున్న ఊర్లన్నీ తిరిగి రాత్రికి టౌనుకు చేరింది. మొదటి రోజు వ్యాపారం నాలుగు వేలు. ఆదెమ్మ ఆనంద్‌ల ఆనందానికి అవధులే లేవు. అంగడిలో డబ్బు జమ చేసి మరిన్ని అవసరమైన సరుకులతో రాత్రికి ఊరు చేరుకున్నారు. పండుగ సీజన్ కావడంతో మరుసటి రోజు నుండి వ్యాపారం బాగా పుంజుకోసాగింది. దానికి తోడు పెద్దమ్మా, పిన్నమ్మా, మామయ్యా, తాతయ్యా అంటు ఆత్మీయంగా వరుసలు కలిపి ఆదెమ్మ అందరికీ చవకగా సరుకులలు అందిస్తుంటే ఇష్టపడి కొంటు టౌనుకు వెళ్లడమే మానుకున్నారు.

ఆకు కూరలు, కాయగూరలు, పులబుట్టలు, కోళ్లు మార్కెట్టుకు తరలించడానికి, అక్కడ దళారీల నుండి డబ్బు వసూలుల చేయడానికి తిరగాల్సిన తిరుగుళ్లు తీరినట్లు పల్లెల రైతులు తమ ఉత్పత్తులను ఆదెమ్మకే అమ్మసాగారు. చూస్తుండగానే నెల రోజులు గడిచాయి.

ఖర్చులు పోను యాభైవేల ఆదాయం!! ఆదెమ్మ ఆనంద్‌లు తమ లెక్కలను తామే నమ్మలేకపోయారు.

ఇప్పుడు వారు పట్టిందంతా బంగారమే. బ్యాంకులో లోన్ చేసి "ప్రజా సరుకుల వాహనం" అని అన్ని ఏర్పాట్లతో కూడిన రెండు వాహనాలు ప్రత్యేకంగా తయారు చేయించి గ్రామ గ్రామానికీ తమ సేవల నందించడమే కాదు ఇద్దరు డ్రయివర్లకు, నలుగురు పనివారికి ఉపాధి కల్పిస్తూ ఎంతోమంది నిరుద్యోగులకు ఆదర్శమైపోయారు.


రూ. 3,50,000/-ల విలువగల
బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |

ప్రత్యేక బహుమతులు:
మారుతి, హీరో హోండా
మోటార్ సైకిల్, ఛేతక్
స్కూటర్, కలర్ టి.వి., ఫ్రిజ్,
ఎయిర్‌కూలర్,
వాషింగ్ మిషన్

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

కన్సోలేషన్ బహుమతులు:
(ఎం.బి. & హెచ్.పి. పథకము ననుసరించి) కెమేరా, టూ-ఇన్-వన్, గోల్డ్ చైన్ శారీస్, రిస్ట్‌వాచ్ వంటి బహుమతులు గెలుపొందండి.

పై నమూనాలోవలె 9 ఖాళీ గడులను గీయండి. 2 నుండి 10 వరకు గల అంకెలను ఉపయోగిస్తూ నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 18 వచ్చేలా చూడండి. ఒక అంకెను ఒక్కసారి మాత్రమే వాడాలి. పోస్టుకార్డ్/ఇన్‌లాండ్/ఎన్వెలప్‌పై మీ ఎంట్రీలన్నింటిని 10 రోజులలోగా ఆర్డినరీ పోస్ట్‌ద్వారా పంపండి. ముందుగా చేరిన మొదటి 200 ఎంట్రీలకు ఆటోమాటిక్ కెమేరా ఉచితం.

SHIVAM TRADERS (aj-2)
P.O. Box No: 9264, Delhi - 110 092